క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలి



తాడేపల్లిరూరల్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీలను సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మందా వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. బుధవారం మంగళగిరి పట్టణ పరిధిలోని ఐబీఎన్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో వచ్చే ఏడాది ఫిబవరిలో విజయవాడ నగరంలో బహిరంగ సభను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 15వ తేదీన గుంటూరు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి చందోలు విక్టర్ పాల్, ప్రధాన కార్యదర్శి ఇందుపల్లి రామారావు మాట్లాడారు. నియోజకవర్గ కన్వీనర్ కె.నాగేశ్వరరావు, ఎంఎస్పీ పట్టణ అధ్యక్షులు పి.భాస్కరరావు, పి.థామస్, వై.జ్యోతి, శ్యామల, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

ఆస్తి వివాదంలో వ్యక్తి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: ఆస్తి వివాదంతో మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు.. చినకాకానిలో నివాసముండే జె.స్వామి(48)కి అతడికి పెద్దల నుంచి వచ్చిన పంట భూమి ఉంది. ఆ పంట భూమిలో వ్యవసాయం చేసుకుంటూ తన భార్య సుజాత, ముగ్గురు కుమార్తెలు, కొడుకును పోషించుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో స్వామి బంధువులు ఆ పొలంలో తమకు కూడా వాటా ఉందంటూ హైకోర్టు నుంచి నోటీసులు పంపించారు. రెండు రోజుల నుంచి మానసికంగా ఆందోళన చెందుతున్నాడు. బుధవారం ఇంట్లోని రాడ్‌కు తాడుతో ఉరి వేసుకుని మృతిచెందాడు. ఘటనపై స్వామి కుమారుడు నరసింహనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యానికి బానిసైన యువకుడి..

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలెంలో మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు.. యర్రబాలెంలో నివాసముండే మస్తాన్(లేటు), ఫాతిమా కుమారుడైన నాగుల్ మీరా(33) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో భార్య విడాకులు ఇచ్చి వెళ్లిపోవడంతో తల్లి దగ్గరే జీవిస్తున్నాడు. తల్లి మంగళవారం మద్యానికి నగదు ఇవ్వకపోవడంతో పలుమార్లు తల్లితో గొడవపడ్డాడు. తెల్లవారుజామున మద్యానికి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపంతో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఘటనపై తల్లి ఫాతిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

అక్రమ మద్యం కలిగిఉన్న వ్యక్తి అరెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తిని బుధవారం తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచారు. ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాలు.. ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చిర్రావూరుకు చెందిన టంకశాల శ్రీనివాసరావు తన బడ్డీ కొట్లో మద్యం నిల్వలు ఉంచి విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో తనిఖీ చేశామని, ఈ తనిఖీల్లో శ్రీనివాసరావు బడ్డీ కొట్లో 40 క్వార్టర్ బాటిళ్లు లభ్యం కావడంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ వివరించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఫిరంగిపురం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూఅంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం సమ్మె నిర్వహించారు. యూనియన్ మండల ప్రాజెక్ట్ అధ్యక్షురాలు కె.విజయ మాట్లాడుతూ సమస్యలు ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని కోరారు.

ఉజ్వల్ యోజనతో మహిళలకు మేలు

ఫిరంగిపురం: ప్రధానమంత్రి ఉజ్వల్ యోజనతో మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జూపూడి రంగరాజు అన్నారు. మండలంలోని గుండాలపాడు, బేతపూడి గ్రామాల్లో బుధవారం వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు నేతలు కోరారు. కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యురాలు శనక్కాయల అరుణ, సుబ్బారావు, కె.బ్రహ్మయ్య, ఎం.హనుమంతరావు, ఆర్.నారాయణ, ఈటీపీఆర్డీ నిర్మలలక్ష్మీ కుమారి పాల్గొన్నారు.

ప్రకాష్ నగర్.. వైద్యంలో నంబర్-1

వైద్య ప్రమాణాలు పాటించడంలో సత్తాచాటింది. అన్ని విభాగాలు ఘనమైన సేవలు అందుతున్నాయి. కార్పొరేట్‌కు ధీటుగా వైద్యులు సేవలందించారు. ఫలితంగా కేంద్రం ప్రభుత్వ నాణ్యత ప్రమాణాల లెక్కింపులో అగ్రస్థానంలో నిలిచింది.

యర్రబాలెంకు ద్వితీయ స్థానం

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యం, విద్యకు తగిన ప్రాధాన్యం ఇచ్చారు. వైద్యశాలలను నాడు– నేడు కింద కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పించారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. రాజీపడకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వైద్యులు సేవలందిస్తున్నారు. దీంతో జాతీయ స్థాయి గుర్తింపు లభించింది.

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో మొత్తం తొమ్మిది వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశారు. అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్యే కోటా నిధులు వెచ్చించి సదుపాయాలు కల్పించారు. దీంతో ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రతిరోజు ఓపి 100కు పైగా నమోదు అవుతోంది. దీంతో కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ పలు అర్బన్ హెల్త్ సెంటర్లలో నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ బృందం సర్వే నిర్వహించింది. అందులో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలవడం, గుంటూరు జిల్లా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ప్రకాష్‌నగర్ డ్రైవర్ కాలనీలో వున్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు జాతీయ స్థాయిలో మొదటి స్థానం నిలబడి 97 మార్కులు సాధించారు. యర్రపాలెం హెల్త్ సెంటర్‌కు 92 మార్కులు సాధించాయి.

ప్రత్యేక ల్యాబ్‌లు..

డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ఎన్నడూ లేనివిధంగా వైద్యపరీక్షల కోసం ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేసి అందులో టెక్నీషియన్స్, ఇతర సిబ్బందిని నియమించి 64 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు.



ప్రకాష్ నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

ఫార్మసీ..

ఇప్పుడు ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ఫార్మసీ ఏర్పాటు చేశారు. వైద్యుల సూచనల మేరకు మందులను అందిస్తున్నారు. సుమారు 172 రకాల మందులు అందుబాటులో ఉంచారు. ప్రజలు రూపాయి ఖర్చు లేకుండా వైద్యసేవలు పొందుతున్నారు.

వ్యాక్సిన్‌పై ప్రత్యేక దృష్టి

కరోనా లాంటి మహమ్మారిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌లో కరోనా వ్యాక్సిన్‌తో పాటు చిన్నపిల్లలకు అవసరమైన టీకాలు, గర్భిణులకు, బాలింతలకు టీకాలను అందుబాటులో ఉంచి ప్రతి ఒక్కరికి సేవలు అందిస్తున్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మానస

ఉమ్మడి కృషి వల్లే మొదటి స్థానం లభించింది.

డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సిబ్బంది ఉమ్మడి కృషితో మా సెంటర్‌కు 97 మార్కులు లభించాయి. మా సేవలను గుర్తించి వైద్యసేవలు అందించే విషయంలో పై అధికారులు పూర్తి సహకారాలు అందించడం వల్లే జాతీయస్థాయి గుర్తింపు లభించింది. జిల్లా స్థాయి అధికారులతో కలసి పేద ప్రజలకు వైద్యసేవలు మరింత పెంచే విధంగా సమష్టిగా కృషి చేస్తాం. – డాక్టర్ మానస

ఎమర్జెన్సీ సర్వీసులు

గతంలో ఎవరికైనా రోగికి ఎమర్జెన్సీగా పరీక్షలు నిర్వహించాలంటే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలకు పంపాల్సి వచ్చేది. ఇప్పుడు మండల, పట్టణ పరిధిలోనే ఈసీజీ, నెబ్యూలైజేషన్ సేవలను అందుబాటులో ఉంచారు.

జిల్లాకు గుర్తింపు రావడం హర్షణీయం



కేంద్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ బృందం సర్వేలో మన గుంటూరు జిల్లా జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో ఉండడం చాలా సంతోషించ దగ్గ విషయం. ప్రభుత్వ వైద్యశాలలో కేంద్ర స్థాయి నుండి అన్ని రకాల వైద్యపరీక్షలు చేయడం, అవసరమైతే జిల్లా స్థాయిలో ఆరోగ్య పరీక్షలపై ఎప్పటికప్పుడు వచ్చిన ఆరోగ్య సమస్యలను పరిష్కరించడం వలన ఈ గుర్తింపు లభించింది. – డి.ఇ.వో. అనిల్ కుమార్

రూపాయి కూడా ఖర్చు లేదు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత వైద్య నిమిత్తం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. నాకు 20 సంవత్సరాల నుంచి షుగర్ ఉంది. గతంలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి షుగర్ టెస్ట్ చేయించుకోగా రూ.300 తీసుకునేవారు. మరో వెయ్యి రూపాయల వరకు మందులకు ఖర్చు అయ్యేది. మా ప్రాంతంలో ఈ ఆస్పత్రి నిర్మించిన తరువాత ఒంట్లో ఎటువంటి నలత ఉన్నా ఇక్కడకు వచ్చి పరీక్షలు చేయించుకుని మందులు తీసుకువెళుతున్నా. వైఎస్ జగన్ పుణ్యమా అంటూ నాకు వైద్యానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు కావడం లేదు. – దర్శి సరోజనమ్మ

కేఎల్‌యూలో నేడు ఓటర్లకు అవగాహన సదస్సు

డెప్యూటీ కలెక్టర్ కె.స్వప్న

తాడేపల్లిరూరల్: యువ ఓటర్లకు అవగాహన కల్పించడానికి తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా డెప్యూటీ కలెక్టర్ కె.స్వప్న తెలిపారు. ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ సదస్సుకు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఓటరు నమోదుపైన యువతీ యువకులకు అవగాహన కల్పించడానికి కీలకప్రాంతాల్లో సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ సతీష్, వడ్డేశ్వరం, గుండిమెడ వీఆర్ఓలు ఆషా, మల్లికార్జునరెడ్డి, వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అసోసియేట్ డీన్ రవీంద్రనాథ్, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, ఎన్‌సీసీ ఆఫీసర్ మౌనిక పాల్గొన్నారు.



కేఎల్‌యూలో ఓటర్ల అవగాహన సదస్సు ఏర్పాట్లపై చర్చిస్తున్న డెప్యూటీ కలెక్టర్ కె.స్వప్న

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సీపీఐ నాయకుల వినతి

తాడేపల్లిరూరల్: మిచాంగ్ తుఫాన్ బాధిత, కరువు రైతాంగాన్ని ఆదుకోవాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూకి సీపీఐ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యాలయంలో ఆయన కలసి వివరించారు. మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జల్లి విల్సన్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకరరావు మాట్లాడుతూ వరి పంట వేసిన సుమారు 10 లక్షల ఎకరాల్లో రైతాంగం నష్టపోయిందని పేర్కొన్నారు. వరితో పాటు మొక్కజొన్న, పొగాకు, పత్తి, అరటి, మిర్చి, బొప్పాయి, పూలు, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. రాష్ట్రానికి రూ.1000 కోట్లు తక్షణ సాయం ప్రకటించాలని కోరారు. నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు 30 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ఉద్యాన పంటలకు రూ.75 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరినట్లు చెప్పారు. రైతులు రెండవ పంట వేసుకునేందుకు రుణాలు, వరి, మినుము తదితర విత్తనాలను ఉచితంగా అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సిహెచ్.కోటేశ్వరరావు, ఏపీ విపత్తుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాల్గొన్నారు.



రాజేంద్ర రత్నూకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

వైభవంగా పోలి పాడ్యమి



కృష్ణానది దిగువ ప్రాంతం సీతానగరం పుష్కరఘాట్ల వద్ద దీపాలు వెలిగించి నదిలో విడిచిపెడుతున్న భక్తులు

తాడేపల్లిరూరల్: కార్తికమాసం ముగింపు సందర్భంగా పోలి దీపాలు వదిలేందుకు భక్తులు సీతానగరం పుష్కర ఘాట్ల వద్దకు బుధవారం తెల్లవారుజాము నుంచి చేరుకున్నారు. నెల రోజులుగా శివుడిని భక్తి శ్రద్ధలతో పూజించి, చివరి రోజు అయిన బుధవారం స్నానాలు ఆచరించి నదిలో దీపాలు వదిలారు. నదీ తీరంలోని సంగమేశ్వర, సోమేశ్వర రాజరాజేశ్వరి స్వామి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

మానవ రవాణాపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల డాక్టర్ కేఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.బలరామకృష్ణ మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద నేరంగా ఉందని చెప్పారు. ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని, ప్రతి విద్యార్థిని తమ పరిధిలో ఉన్న వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.గిరిధర్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం యువత మొబైల్, ఇంటర్‌నెట్ ద్వారా సైబర్ ట్రాపింగ్‌కు గురి అవుతున్నారని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెసేజ్‌లు,, కాల్స్ గానీ వచ్చినప్పుడు జాగ్రత్తలు వహించాలని వివరించారు. కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అనీల్ కుమార్ పాల్గొన్నారు.

ఈనెల 21, 22 తేదీల్లో బాలోత్సవం

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు వీవీ ప్రసాద్, కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈనెల 21,22 తేదీల్లో ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలెంలోని డాన్ బాస్కో ఉన్నత పాఠశాలలో బాలోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళగిరి ఎకో పార్కులో ది మంగళగిరి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ బాలోత్సవంలో సబ్ జూనియర్స్ 3,4,5 తరగతులు, జూనియర్స్ 6,7 తరగతులు, సీనియర్స్ 8,9,10 తరగతుల విద్యార్థులకు కల్చరల్, అకడమిక్ ఈవెంట్లలో విభాగాల వారీగా జరుగుతాయని, విభిన్న రంగాల్లో విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు ఈ బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. కల్చరల్ ఈవెంట్లలో జానపద నృత్యం, దేశభక్తి,అభ్యుదయ గీతాలు, లఘు నాటికలు, శాస్త్రీయ నృత్యం, ఏకపాత్రాభినయం, ఫ్యాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ, కోలాటం, రైమ్స్ పోటీలు ఉంటాయని, అకడమిక్ ఈవెంట్లలో చిత్రలేఖనం, వ్యాసరచన(తెలుగు, ఇంగ్లీష్), కథారచన(తెలుగు), కవితా రచన, ఉపన్యాసం (తెలుగు,ఇంగ్లీష్), స్వచ్ఛ తెలుగు పద్యభావం, మ్యాప్, క్విజ్, మట్టితో బొమ్మలు చేయడం వంటి అంశాలుంటాయని వివరించారు. కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులుగా ఆంధ్ర నాటక కళాసమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా నిర్మల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కేఎల్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రీపతిరాయ్, కోశాధికారిగా గాదె సుబ్బారెడ్డి వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీకే జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మంచా విజయ మోహనరావు, కార్యదర్శి వీజే జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ ప్రగడ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడిలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సెమీ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాల వైద్యులు రమాదేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీస్తు జననం అందరికీ పవిత్రమని, ఏసు లోకాన్ని ఉద్ధరించడానికి అవతరించాడని వివరించారు. కళాశాల చైర్మన్ చందు రామారావు మాట్లాడుతూ జీసస్ సమాజాన్ని సక్రమ మార్గంలో నడిపించడానికి జన్మించాడని అన్నారు. కళాశాల సెక్రటరి చందు విజయలక్ష్మి మాట్లాడుతూ జీసస్ చూపించిన క్షమాగుణం, సేవాభావం, మానవత్వం, ప్రేమ అందరూ కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులుబైబిల్ పఠనం, జీసస్ గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో దర్శికి చెందిన ప్రముఖ స్టూడెంట్ కౌన్సిలర్ సూర్యచంద్ర, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తాడివాక రాఘవేంద్ర విష్ణు, కో ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామారావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ గోపయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ చందు రామారావు

అధికారులు సమన్వయంతో పని చేయాలి

మేడికొండూరు: మండలపరిషత్ కార్యాలయంలో మండల ఆహార సలహా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ మన్నవ స్వప్న అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సమావేశాన్ని అన్ని శాఖలు సమన్వయంగా జరపాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసశర్మ, డెప్యూటీ తహసీల్దారు కుంభా శ్రీనివాసరావు, ఎంపీడీఓ ప్రభాకర్‌రావు, ఇండియన్ గ్యాస్ డీలర్ వై.శ్రీనివాసరావు, మండల విద్యా శాఖ అధికారి ఏసురత్నం, డీలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బాజీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాస శర్మ

ఢిల్లీ జట్టుకు 6 పాయింట్లు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఏసీఏ ఇంటర్నేషనల్ స్టేడియంలో బుధవారం ఢిల్లీ, కర్ణాటక జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. కర్ణాటక జట్టులో అమోగ్.ఆర్.శెట్టి 150 బంతుల్లో 94 పరుగులు చేయగా, ఢిల్లీ జట్టులో ప్రద్యుమ్న సానా 39 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో 16.3 ఓవర్లకు గాను 5 వికెట్లు తీసుకున్నాడు. ఢిల్లీకి చెందిన ప్రముఖ మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ 19 బంతుల్లో 21 పరుగులు చేయగా, ధ్యాన్.ఎం.హైర్‌మాథ్ 8 పరుగులు చేశాడు. ఢిల్లీ జట్టు కర్ణాటకపై ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఢిల్లీ జట్టుకు 6 పాయింట్లు దక్కగా, కర్ణాటక జట్టు 0 పాయింట్లతో నిలిచింది.



39 పరుగులు చేసి, కర్ణాటక వికెట్లు పడగొట్టిన బౌలర్ ప్రద్యుమ్న సానా

ఎమ్మెల్సీ మురుగుడు విస్తృత పర్యటన



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాలను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నగర పరిధిలోని హుస్సేన్ కట్ట వెంబడి ప్రధాన డ్రెయిన్‌లో చెత్తాచెదారం పేరుకుపోవడానిపరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. హుస్సేన్ కట్ట నుంచి కొప్పురావూరు కాలనీ 8,9 లైన్ల వరకు డ్రైనేజీని పరిశీలించగా అక్కడక్కడ శిథిలావస్థకు చేరిందని పేర్కొన్నారు. డ్రెయిన్ పనులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట కమిషనర్ నిర్మల్ కుమార్, డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, డీఈ కృష్ణారెడ్డి ఉన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు సత్కారం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రకాశం బ్యారేజ్ వద్ద విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. విజయవాడకు చెందిన లోకా సమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ ఆధ్వర్యంలో సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ నరసింహులు మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజ్ అవుట్ పోస్ట్ వద్ద హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బండ్ల నాగేశ్వరరావు ప్రకాశం బ్యారేజ్ కృష్ణానదిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న సుమారు 150 మందిని కాపాడి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి మరో జీవితాన్ని అందించారని అన్నారు. నాగేశ్వరరావును సత్కరించిన వారిలో ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ మాకినేని నవీన్ కుమార్, సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ డాక్టర్ కోళ్ళపూడి హేమ సుందర్ ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి



మేడికొండూరు: మానవ అక్రమ రవాణాపై మేడికొండూరులోని మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ కె.బలరామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం విజయభారతి, డాక్టర్ సునీత కృష్ణన్, ప్రజ్వల సంస్థ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లికి చేరుకున్న భగత్ సింగ్ జన్ అధికార్ యాత్ర

తాడేపల్లిరూరల్: పెరుగుతున్న ధరలను అదుపుచేయాలని లేకుంటే గద్దె దిగిపోవలని అని కోరుతూ డిసెంబర్ 10న ప్రారంభమైన భగత్‌సింగ్ అధికార్ రెండో దశ యాత్ర బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లికి చేరింది. తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన సభలో ప్రొఫెసర్ బూరుగ శ్రీనివాసరావు మాట్లాడారు.

ఆడుదాం ఆంధ్రాకు సర్వం సిద్ధం

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద ప్రజలు, క్రీడాకారులలో దాగిలున్న ప్రతిభను వార్డు స్థాయి నుంచి గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా పేరుతో ఆటల పోటీలను నిర్వహిస్తోంది. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీల్లో భాగంగా బుధవారం పలు ప్రాంతాల్లో ఎంటీఎంసీ అధికారులు ఆట స్థలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 24 సచివాలయాల్లో ఇప్పటికే క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకున్నారని, ఈనెల 15 నుంచి క్రీడలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 14 గ్రౌండ్‌లు సిద్ధం చేశామని, ఎక్కడెక్కడ ఏ ఏ క్రీడలు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామని చెప్పారు.